సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం । 19 । మార్చి । 2025



ఇస్రో చూసొద్దామా!
బాల్య దశలోనే విద్యార్థులను సైన్స్, అంతరిక్ష సాంకేతిక రంగాల వైపు మళ్లించేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) కృషి చేస్తోంది.

-8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ॥ (సా॥)	సహర్ గురు॥ (ఉ॥)
కడప	6.31	5.05
పులివెందుల	6.33	5.10
ప్రొద్దుటూరు	6.32	5.09

గరిష్ఠం/కనిష్ఠం
40.0/24.1

వాతావరణం
జిల్లాలో మంగళవారం 24.1 - 40.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కార్మికులు అప్రమత్తంగా ఉండాలి
కడప కోటిరెడ్డిసర్కిల్: పెరిగిన ఉష్ణోగ్రతల నేపథ్యంలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని ఉప కార్మిక కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కార్మికుల రక్షణకు యాజమాన్యాలు తమవంతుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్మికుల పని వేళల్లో మార్పు చేయాలని, పని ప్రాంతంలో చల్లని నీరు, నీడ వసతి కల్పించాలని, వైద్య సిబ్బందిచే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫ్లూయిడ్స్, అత్యవసర మందులు సమకూర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ ప్రదేశంలో కార్మికులు పనిచేయకుండా యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం
ప్రొద్దుటూరు: బీసీ కార్పొరేషన్, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించి మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22లోపు ఏపీఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన లబ్ధిదారులకు శిక్షణ అనంతరం 75 శాతంపైగా హాజరు కలిగిన వారికి సర్టిఫికెట్, ఉచితంగా కుట్టుమిషన్ అందిస్తారని వివరించారు. 18-50 ఏళ్లలోపు గల మహిళలు అర్హులని, తెల్ల రేషన్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు ఉండాలని, కుటుంబంలో ఒకరు మాత్రమే లబ్ధి పొందుటకు అర్హులని తెలిపారు.

మద్యం ప్రీమియం స్టోర్‌కు...
కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఒక ప్రీమియం స్టోర్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని జిల్లాప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రీమియం స్టోర్ లైసెన్స్ వ్యవధి 5 ఏళ్లని, లైసెన్స్ ఫీజు ఏడాదికి రూ. కోటి ఉంటుదని రెండవ సంవత్సరం నుంచి ఉన్న ఫీజు 10 శాతం పెరుగుదల ఉంటుందని పేర్కొన్నారు. ప్రీమియం స్టోర్ కార్పెట్ వైశాల్యం 4 వేల చదరపు అడుగులు ఉండాలని తెలిపారు. ప్రీమియం స్టోర్ దరఖాస్తు కోసం రుసుము రూ. 15 లక్షలు డీడీ ద్వారా తీసుకురావాలని సూచించారు. ఆసక్తి గల వారు ఈ నెల 26 సాయంత్రం 5 లోపల దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆర్టీపీపీలో పెరిగిన బొగ్గు నిల్వలు



ఆర్టీపీపీలో బొగ్గు నిల్వలు

ఎర్రగుంట్ల: డాక్టరు ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ)లో బొగ్గు నిల్వలు పెరిగాయి. ప్రస్తుతం ఆర్టీపీపీలో 1.38లక్షలు మెట్రిక్ టన్నులు నిల్వలు ఉన్నాయని ఆర్టీపీపీ సీఈ గౌరీపతి మంగళవారం తెలిపారు. ఆర్టీపీపీలోని 1,2,3,4,5,6 యూనిట్లలో గాను 1650 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తికి గాను ప్రస్తుతం 1420 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని వెల్లడించారు. అన్ని యూనిట్లులో విద్యుత్ ఉత్పత్తికి గాను సుమారు 21 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు వినియోగం అవుతోందని పేర్కొన్నారు.

పైడిపాళెం ఆయకట్టుకు కృష్ణా జలాలు



గండికోట జలాశయం

కొండాపురం: గండికోట జలాశయంలో నుంచి గండికోట ఎత్తిపోతలపథకం వద్ద ముడు మోటర్ల ద్వారా 300 క్యూసెక్కులనీటిని పంపింగ్ చేస్తున్నట్లు జీకేఎల్ఐ ఈఈ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పైడిపాళెం జలాశయ ఆయకట్టు రైతులకు సాగు,తాగునీరు అవసరాల కోసం గండికోట ఎత్తిపోతల పథకం నుంచి గండికోట డ్యామ్ లో నిల్వ ఉన్న కృష్ణ జలాలను పంపింగ్ చేస్తున్నామన్నారు. పైడిపాళెం జలాశయం పూర్తి సామర్థ్యం 6 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం జలాశయంలో4.2 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు ఆయన తెలిపారు.గండికోట జలాశయం పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం గండికోట లో 23.5టీఎంసీలు ఉన్నట్లు గాలేరినగరి సృజలస్రవంతి ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు.

పచ్చ మంద.. మట్టి దందా!

అక్రమ మైనింగులతో పచ్చ నేతలు బరి తెగిస్తున్నారు. అనుమతుల్లేకున్నా.. లైసెన్సులు రాకున్నా దర్జాగా పనులు సాగిస్తున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా మట్టి, ముగ్గు రాయిలను ఎంచక్కా లూటీ చేస్తున్నారు. 'బాబు పాలనంతే.. బాబు పాలనంతే..'అంటూ అధికారులు మౌనంగా డ్యూటీ సాగిస్తున్నారు.

'బ్రదర్స్' గుప్పిట్లో.. నానా పల్లె కొండ!
- పోటీలు పడి తోలుతున్న అధికార పార్టీ నేతలు
- కి.మీల మేర కరిగిపోతున్న కొండలు
- చోద్యం చూస్తున్న మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



మట్టి అక్రమ రవాణా వల్ల సగ భాగం ఖాళీ అయిన కొండ

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లా కేంద్రమైన కడప నగరంలో మట్టి, గ్రావెల్ అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అధికార పార్టీ నాయకులు బృందాలుగా ఏర్పడి పోటీలు పడి మట్టిని తోలుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. టీడీపీ నాయకుల ధన దాహం వల్ల నానాపల్లె సమీపంలోని కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. చదును ప్రదేశాలు లోయలుగా మారుతున్నాయి. కిలోమీటర్ల మేర కొండలను పిండి చేసి లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వానికి రూపాయి కూడా రాయల్టీ చెల్లించకుండా మట్టి, గ్రావెల్‌ను అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నానాపల్లె వద్ద 919/1 సర్వే నంబర్‌లో యానాది కొట్టాల వద్ద కాలభైరవ గడి వద్ద పాత కడపకు చెందిన టీడీపీ నేత కొండను తవ్వేసి చదును చేస్తున్నారు. ఆ మట్టిని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటూ మట్టి తీసిన స్థలాన్ని చదును చేసి ఆక్రమించుకోవాలని రంగం సిద్ధం చేశారు. ఇదివరకు చిన్నచౌకు పోలీసులు మట్టి అక్రమంగా రవాణా చేసే టిప్పర్లను పట్టుకున్నప్పటికీ నాలుగైదు రోజులకే వాటిని విడిపించుకుపోయి...కొన్నాళ్లు సైలెంట్‌గా ఉండి అదును చూసి విజృంభిస్తూ అంతకు రెండుమూడింతలు ఆర్జిస్తున్నట్లు తెలుస్తోంది.

రాత్రింబవళ్లు 4 జేసీబీలతో..



మట్టి తవ్వేందుకు వెళ్తున్న జేసీబీలు

జగనన్న కాలనీ ఎస్‌టీపీ రెండో లే ఔట్ పైన నానాపల్లె, వైఎస్సార్ కాలనీ సమీపాన ఎన్‌జీఓ కాలనీకి చెందిన ఇద్దరు టీడీపీ బ్రదర్స్ 3 జేసీబీలతో గ్రావెల్ అక్రమ రవాణా సాగిస్తున్నారు. యానాది కొట్టాల వద్ద మరో జేసీబీతో తవ్వుతున్నారు. పదుల సంఖ్యలో టిప్పర్లు ఏర్పాటు చేసి టన్నుల కొద్దీ మట్టిని మాయం చేస్తున్నారు. కాలువల పక్కనున్న పొరంబోకు స్థలాలు, వివాదాస్పద డీకేటీ స్థలాల్లో మకాం వేసి ఈ మట్టిని ఆయా ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. లీజు క్వారీల నుంచి మట్టి తోలితే ఒక టిప్పరుకు రూ.1750లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. వీరు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా...ప్రభుత్వానికి రూపాయి కూడా చెల్లించకుండా కేవలం రూ.4000 నుంచి రూ.5000లకు టిప్పర్ మట్టిని తోలుతూ జేబులు నింపుకుంటున్నారు. లీజు క్వారీలకు అనుమతి ఉన్నవారిని సామ, దాన, భేద, దండోపాయాల ద్వారా బెదిరించి క్వారీలు మూయించిన అధికార పార్టీ నేతలు, తమ టిప్పర్లతో విచ్చలవిడిగా అక్రమ రవాణా చేస్తున్నారు. వైఎస్సార్ కాలనీకి పోయే మార్గంలోనే ఇదివరకు చెక్‌పోస్టు ఉండేది. అది ఉన్నప్పుడు ఎంతోకొంతైనా రాయల్టీ ప్రభుత్వానికి దక్కేది. ఇప్పుడు ఆ చెక్‌పోస్టు కూడా ఎత్తేయడంతో అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. సామాన్యులు, చిన్నా, చితకా వారి నుంచి ముక్కుపిండి రాయల్టీ వసూలు చేసే మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు.... ఫోన్లు చేసి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రింబవళ్లు టిప్పర్లతో మట్టి తోలడం వల్ల రోడ్లు గుంతలమయంగా మారాయి. పక్కనున్న జగనన్న కాలనీలు ఎర్రటి మట్టితో నిండిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

ముగ్గురాయి లూటీ.. మౌనరాగమే అధికారుల డ్యూటీ!

వేంపల్లె: పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నాయకులు అక్రమ మైనింగ్‌లతో చెలరేగుతున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు , లైసెన్స్ మాటే లేకుండా మైనింగ్ కార్యకలాపాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని లింగాల, పులివెందుల, వేముల, వేంపల్లె మండలాల్లో టీడీపీ నాయకుల దందా జోరుగా సాగుతోంది. వీరికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అండదండలు పుష్కలంగా ఉండడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాక అక్రమ మైనింగ్‌లో టీడీపీ బడా నాయకులకు వాటాలు కూడా వెళుతున్నట్లు సమాచారం. ఇటీవలే సంక్రాంతి పండుగ రోజు టిఫెన్ కంపెనీకి చెందిన దాదాపు రూ.15కోట్ల విలువైన ముగ్గురాయిని రాత్రికి రాత్రే వేముల మండలానికి చెందిన టీడీపీ నాయకుడు తరలించుకున్న విషయం తెలిసిందే. ఈ విషయమై టిఫెన్ కంపెనీ వారు పోలీసులకు, మైనింగ్ అధికారులకు సాక్ష్యాలతో సహా ఫిర్యాదు చేసినా వారి నుంచి స్పందన లేకుండా పోయింది.

మైనింగ్ పనులు చేపడుతూ వ్యక్తి మృతి..
వేంపల్లె మండలం కత్తులూరు గ్రామ సమీపంలో మైనింగ్ పనులు చేపడుతూ మంగళవారం ప్రమాదవశాత్తు చిట్టిబోయిన రామచంద్ర(55) మృతి చెందాడు. మృతుడు వేముల మండలం అమ్మయ్యగారి పల్లె గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. రోజు లాగే ముగ్గురాయి పనులకు వెళ్లిన చిట్టిబోయిన రామచంద్రపై ఒకసారిగా మట్టి ఉళ్లి పడింది. ఆ మట్టిలో రామచంద్ర కురుకుపోయాడు. జరిగిన విషయాన్ని మృతుని బంధువులకు సమాచారమివ్వడంతో కుమారుడు రాజశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని వెలికి తీశారు. అప్పటికే మట్టిలో కూరుకుపోయిన తండ్రి రామచంద్ర మృతి చెందాడు. వేముల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సంఘటన స్థలాన్ని వేంపల్లె సీఐ సురేష్ రెడ్డి, వేముల ఎస్ఐ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు.



కూరుకుపోయిన రామచంద్రను వెలికి తీస్తున్న కూలీలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జెడ్పీ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

కడప సెవెన్‌రోడ్స్: కడప జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 23న జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ జెడ్పీ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు ఉద్దేశించిన ప్రత్యేక సమావేశం ఏర్పాటు కోసం నోటీసు జారీ చేస్తారు. ఈ నోటీసు జెడ్పీ సభ్యులందరికీ అధికారులు అందజేయాల్సి ఉంటుంది. ఈనెల 27వ తేది ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి జెడ్పీ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఆరోజు ఉదయం 10 గంటల ముందు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 12.00 గంటల్లోపు స్క్రూటినీ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు అర్హతగల నామినేషన్ల జాబితా విడుదల చేస్తారు. 1 గంటవరకు నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం ఉంటుంది. ఆపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. సమావేశం ముగిసిన వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. ఏదైనా కారణాల వల్ల ఆరోజు ఎన్నిక జరగకపోతే మరుసటిరోజు ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే ఉమ్మడి కడపజిల్లాలోని ఖాజీపేట, ఒంటిమిట్ట, రాయచోటి మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నికలను కూడా నిర్వహిస్తారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన ఆకేపాటి అమర్‌నాథ రెడ్డి రాజంపేట అసెంబ్లీ స్థానం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున గెలుపొందడంతో ఈ ఖాళీ ఏర్పడింది. ప్రస్తుతం ఇన్‌చార్జి చైర్ పర్సన్‌గా జేష్టాది శారద వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయడంతో జిల్లా పరిషత్‌కు కొత్త అధ్యక్షుడు ఎన్నిక కానుంది.



జిల్లా పరిషత్ కార్యాలయం

'కోట్లు మింగేశారు'పై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

కడప రూరల్: జిల్లా క్షయ నియంత్రణ విభాగంలో జరిగిన అక్రమాల ఆరోపణలపై ఈ నెల 16న సాక్షిలో ప్రచురితమైన 'క్షయ నియంత్రణ పేరుతో కోట్లు మింగేశారు' కథనంపై రాష్ట్ర స్థాయి క్షయ నియంత్రణ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డాక్టర్ నాగరాజు, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, ఇద్దరు ఆఫీస్ సూపరెండెట్లు విచారణ చేపట్టారు. క్షయ నియంత్రణ విభాగం జిల్లా కార్యాలయంతో పాటు జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న సిబ్బందిని విచారణకు పిలిపించారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు అంశాలను.. ఆసక్తికరమైన విషయాలను విచారణ అధికారుల దృష్టికి తెచ్చినట్లుగా తెలిసింది. అధికారులు చేపుడుతున్న విచారణ..అందుకు సంబంధించి ఉన్నతాధికారులకు సమర్పించే నివేదిక..తదుపరి చర్యలపై ఆ శాఖ ఉద్యోగుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

మద్దతు ధరతో శనగ, మినుముల కొనుగోలు: జేసీ

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో పండించిన శనగ, మినుములను రైతుల నుంచి మద్దతు ధరతో రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నామని, జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేసీ అదితి సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నాఫెడ్/ఎన్‌సీసీఎఫ్ ఆధ్వర్యంలో ఏపి మార్కెఫెడ్ వైఎస్ఆర్ జిల్లాలో శనగ, మినుములు పండించిన, ఈ-క్రాప్ చేయించుకున్న రైతుల నుంచి ప్రభుత్వం శనగ ఒక క్వింటాల్ రూ. 5650లు మినుములు ఒక క్వింటాలు రూ. 7400లు మద్దతు ధరపై కొనుగోలు చేయటుకు అనుమతి ఇచ్చిందన్నారు. ఈనెల 11నుంచి శనగలు, మినుములు సీఎంఏపీపీ నందు రిజిస్ట్రేషన్ అనుమతులు ఇచ్చామని, రైతులు ఇంకా ఎవరైనా తమ పేర్లను నమోదు చేయించుకున్నట్లయితే రైతు సేవా కేంద్రంలో పేర్లను నమోదు చేయించుకోవాలని తెలిపారు. జిల్లాలో 8 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 19 నుంచి కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. ఈ అవకాశమును జిల్లాలో శెనగ, మినుములు పంట పండించిన ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఎం. పరిమళజ్యోతి, జిల్లా అధికారి ఏపీ మార్క్ ఫెడ్ కార్యాలయంలో గానీ, కంట్రోల్ రూమ్ - 70956 21491కు కాల్ చేసి సంప్రదించవచ్చని జేసీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉచిత వైద్య సేవకు ఇబ్బంది లేదు

కడప రూరల్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద పేదలకు అందించే ఉచిత వైద్య సేవలకు ఎలాంటి ఇబ్బంది లేదని ఆ శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు తెలిపారు. ఈ నెల 17 ఒక్కరోజు వైద్య మిత్రలు విధులను బహిష్కరించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నెట్ వర్క్ ఆసుపత్రులకే రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటును కల్పించినట్లు తెలిపారు. మంగళవారం నుంచి వైద్య మిత్రలు అందరూ విధుల్లో పాల్గొన్నారని...యథావిధిగా ఉచిత వైద్య సేవలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

ఊరి బడిపై పిడుగు!

- 3,4,5 తరగతుల విలీనంపై నిరసనల వెల్లువ
- అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయ సంఘాల ఆందోళన
- విలీనం దిశగానే ముందుకెళుతున్న ప్రభుత్వం
- ఇక చిన్న పల్లెల్లో కనుమరుగుకానున్న సర్కారు బడులు

కడప ఎడ్యుకేషన్: పల్లె బడికి ప్రభుత్వం మంగళం పాడనుంది. ఇప్పటివరకు ప్రతి పల్లెలో 1 నుంచి 5 తరగతుల వరకు బోధించే ప్రాథమిక పాఠశాలలు కూటమి ప్రభుత్వ చర్యలతో కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్కో గ్రామ పంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ఆ పంచాయతీలోని మిగిలిన పాఠశాలల 3, 4, 5 తరగతులను తెచ్చి ఒకే పాఠశాలలో కలిపేందుకు సన్నాహాలు చేస్తోంది. అంటే ఇక నుంచి గ్రామ పంచాయతీలో ఒక్క మోడల్ ప్రైమరీ పాఠశాల తప్ప మిగిలిన పల్లెల్లో 1, 2 తరగతులు ఉన్న ఫౌండేషన్ పాఠశాలలు మాత్రమే కనిపిస్తాయి. ఈ ప్రక్రియ క్రమేణా పల్లెబడిని నిర్వీర్యం చేయనుండడంతో పల్లెల్లో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుండగా, అనేక చోట్ల పిల్లల తల్లిదండ్రులు సైతం తమ వ్యతిరేకత గళం వినిపిస్తున్నారు. ప్రభుత్వం ఇవేవీ పట్టించుకోకుండా తాను పట్టిన పట్టును సాధించుకునే దిశగా అధికారులను పురమాయిస్తోంది.

ఒక్కో తరగతికి ఉపాధ్యాయుడు లక్ష్యంగా...
ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలన్న లక్ష్యంగా ప్రభుత్వం మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు చెబుతోంది. ఇది మంచి ఉద్దేశమే అయినా మిగిలిన బడుల్లో 3,4,5 తరగతులను పూర్తిగా ఎత్తేయడాన్ని పల్లె ప్రజానీకం వ్యతిరేకిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా పంచాయతీ పరిధిలోని ఒక పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా చేసి, అక్కడ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించి ఇష్టమున్నవారు మాత్రమే ఇతర పల్లెల నుంచి అక్కడికి వెళ్లవచ్చు అని చెబితే బాగుండేది. అలా కాకుండా ఖచ్చితంగా వెళ్లాల్సిందే అంటే పిల్లలు పూర్తిగా బడికి దూరమయ్యే ప్రమాదం ఉంది. ప్రతీ పల్లెలో ఇప్పటివరకు ఉన్నట్లు ప్రాథమిక పాఠశాలలను కొనసాగిస్తూ, అదనంగా మోడల్ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయాలని మేధావి వర్గం అభిప్రాయపడుతోంది.

ఉంటే ఫౌండేషన్ స్కూల్.. లేదా మోడల్ ప్రైమరీ స్కూల్..
ఇకనుంచి ఏ పల్లెలో చూసినా అటు ఫౌండేషన్ స్కూల్ లేదా ఇటు మోడల్ ప్రైమరీ స్కూల్ మాత్రమే ఉండాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం.అంటే ఇప్పటివరకు నడుస్తున్న ఒకటి నుంచి ఐదు వరకు తరగతుల వరకు ఉండే ప్రాథమిక పాఠశాలలు ఇక కనబడవన్నమాట. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటి, రెండు తరగతులను ఏకం చేసి ఫౌండేషన్ పాఠశాలగా మారుస్తున్నారు. ఆ పల్లెలోని మూడు, నాలుగు, ఐదు తరగతులను పక్కపల్లెకు పంపించి దానిని మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చనున్నారు. అంటే ఈ మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటాడు. ప్రభుత్వం ఇక్కడ ఇంకో మెలిక పెట్టింది 60 మంది విద్యార్థులు ఉంటేనే మోడల్ ప్రైమరీ పాఠశాలగా మారుస్తామంటూ చెబుతోంది. ఇది అన్ని పంచాయతీల్లో సాధ్యం కాకపోవచ్చు.



సికెదిన్నె మండలం శివాజీనగర్ పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న తల్లితండ్రులు




ఒంటిమిట్టలో అందోళన చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి శివాజీనగర్‌లో 3,4,5 తరగతులను మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎర్రమాచుపల్లెలోని పాఠశాలలో విలీనం చేయనున్నట్లు తెలియడంతో ఈనెల 12వ తేదీ విద్యార్థుల తల్లితండ్రులు పాఠశాలకు తాళం వేసి వద్ద ఆందోళన చేశారు. గ్రామంలోని పాఠశాలలో 40 మంది విద్యార్థులున్నారని పాఠశాలను విలీనం చేస్తే మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎర్రమాచుపల్లెలోని పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు పిల్లలు ఇబ్బంది పడతారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్న 3,4,5 తరగతులను సమీపంలోని ఉన్న బడుల్లో విలీనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఒంటిమిట్టలో 12వ తేదీ ఉపాధ్యాయులు నల్లబాడ్జి ధరించి నిరసన చేశారు. పాఠశాల యాజమాన్య కమిటీల తీర్మానాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం ముందుడుగు వేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం కొన్నేళ్లుగా నడుస్తున్న పాఠశాలల మనుగడ ప్రశ్నార్థం చేస్తుందని ఆవేదనను వ్యక్తం చేశారు.

ఇలా ఒక్క చోట కాదు జిల్లాలో చాలా చోట్ల ఇటు తల్లితండ్రులు, అటు ఉపాధ్యాయులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారు.

బడుగు, బలహీన వర్గాలకు...



117 రద్దు ద్వారా తరగతుల విలీనం ఆగిపోతుంది అశించాము. కానీ పాఠశాలల పునర్విభజన ప్రక్రియ ద్వారా తరగతుల విలీనాన్ని పదింతలకు పెంచారు. దీంతో బడుగు బలహీన వర్గాలకు ఊరి బడి దూరం అవుతుంది.

-నర్రెడ్డి సంగమేశ్వరరెడ్డి, ఎస్టీయూ, జిల్లా ప్రధాన కార్యదర్శి

డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం



3,4,5 తరగతుల విలీనం వల్ల గ్రామాల్లో డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం ఉంది. 3,5 కిలోమీటర్ల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల నుంచి ఈ తరగతులను వేరు చేసి ఆదర్శ పాఠశాలల్లో వీలీనం వల్ల బడుగు, బలహీన, పేద వర్గాలకు చెందిన పిల్లలు బడులకు దూరమవుతారు.

- ఎ.శ్యాంసుందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు.

ప్రతి గ్రామంలోను ..



ప్రతి గ్రామంలోను 1 నుంచి 5వ తరగతులు ఉండే బేసిక్ ప్రైమరీ పాఠశాలలను కొనసాగించాలి. జీవో 117 సవరణలో అనేక లోపాలు ఉన్నాయి. వాటిని సరిదిద్దకుంటే పాఠశాలల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుంది. వీలీనం నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాము.

- ఎస్. రామాంజనేయులు, ఎస్టీయూ, రాష్ట్ర అధ్యక్షుడు

క్లుప్తంగా

విద్యుత్ మీటర్ రీడర్ల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యుత్ మీటర్ రీడర్లు

ప్రొద్దుటూరు : స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద మంగళవారం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మీటర్ రీడర్లు నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ మీటర్ రీడర్స్‌కు విద్యుత్ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం వారు ఏపీ ఎస్‌పీడీసీఎల్ ఈఈ రమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు సబ్ డివిజన్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, సుధాకర్, సురేష్, రమణ, శేఖర్, ప్రసాద్, పవన్‌కుమార్, లక్ష్మీనారాయణ, సుబ్బారెడ్డి, రమణ, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న కొండలు

– వృక్ష సంపద అగ్నికి ఆహుతి



పులివెందుల కొండ ప్రాంతంలో కాలిపోతున్న వృక్ష సంపద

పులివెందుల రూరల్ : అడవికి నిప్పు పెట్టడంతో మానవాళికి ముప్పు కలుగుతోంది. పులివెందుల నియోజకవర్గంలోని లింగాల, చక్రాయపేట, వేముల, పులివెందుల మండలాల్లోని కొండలు అగ్నికి ఆహుతి కావడంతో వృక్ష సంపద కనుమరుగవుతోంది. రేయింబవళ్లు కొండలపై మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. కొండ, గుట్ట ప్రాంతాలలో కొంతమంది వ్యక్తులు కొండలకు నిప్పు పెట్టడంతో కొండలు, గుట్ట ప్రాంతాల్లో ఉన్న వృక్ష సంపద ఎందుకు పనికిరాకుండా పోతోంది. ఆకతాయిలు కొండలకు నిప్పు పెట్టడంతో వృక్ష సంపదతోపాటు వన్య ప్రాణులకు తీవ్ర నష్టం జరుగుతోంది. దీనిపై అటవీ శాఖ అధికారులు దృష్టి సారించి అటవీ సంపదను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాకు 5500 ఫారం పాండ్స్ మంజూరు



ఓపెన్ ఫోరంలో పాల్గొన్న పీడీ ఆది శేషారెడ్డి, ఇతర అధికారులు

చక్రాయపేట : జిల్లాకు కొత్తగా 5500 ఫారం పాండ్స్ మంజూరయ్యాయని డ్వామా పీడీ ఆది శేషారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద జరిగిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన ఓపెన్ ఫోరం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చక్రాయపేట మండలంలో సామాజిక తనిఖీ బృందం పరిశీలన సందర్భంగా రూ.55,227 రికవరీ చేశామన్నారు. జిల్లాకు మంజూరైన 5500 ఫారం పాండ్స్‌ను మార్చి నుంచి జూన్ వరకు నెలకు 1400 చొప్పున పూర్తి చేసేలా ప్రణాళిక తయారు చేశామని చెప్పారు. ఈనెల 22న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫారం పాండ్లకు సంబంధించి భూమి పూజ చేస్తారన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి భాస్కర్, ఏపీడీ సోమశేఖరరెడ్డి, డీవీవీఓ రామలింగేశ్వరరెడ్డి, ఏఓ వెంకటరమణ, ఎస్ఆర్‌పీ భాస్కర్, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

ఇస్రో చూసొద్దామా!

- అంతరిక్ష కేంద్రానికి ఆహ్వానం
- 9వ తరగతి విద్యార్థులకు అవకాశం
- మార్చి 23 వరకు ఆన్‌లైన్‌లో నమోదుకు గడువు

షెడ్యూల్ ఇలా..

రిజిస్ట్రేషన్ గడువు	: మార్చి 23 వరకు
ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల	: ఏప్రిల్ 7
విద్యార్థులకు ఆహ్వానం	: మే 18
యువికా కార్యక్రమం	: మే 19వ తేదీ నుంచి 30 వరకు
యువికా ముగింపు	: మే 31వ తేదీ



ఇస్రో కేంద్రం

కడప ఎడ్యుకేషన్ : బాల్య దశలోనే విద్యార్థులను సైన్సు, అంతరిక్ష సాంకేతిక రంగాల వైపు మళ్లించేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) కృషి చేస్తోంది, అంతరిక్ష వీక్షణం, ఉపగ్రహాల ప్రయోగాలు వంటి వాటిపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చి శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా మాట్లాడుతూ భావి తరాల వారిని అంతరిక్ష శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ ఏడాది యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) కింద 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. తమ అధికారిక వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు మార్చి 23 లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు గడువును ప్రకటించింది.

ఎంపిక ఇలా..

8వ తరగతిలో విద్యార్థులకు వచ్చిన మార్కులను 50 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు అదనంగా 15 శాతం, ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే క్విజ్‌లో 10 శాతం, సైన్సుఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులకు 5 శాతం, ఎన్‌సీసీ, స్కౌట్ విద్యార్థులకు 5 శాతం, ఒలంపియాడ్ ఎగ్జామ్స్‌లో పాల్గొన్న వారికి 10 శాతం, ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు 5 శాతం కేటాయించి ఎంపిక చేస్తారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న మెరుగైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

చక్కటి అవకాశం..

అంతరిక్ష రంగంపై ఆసక్తి కలిగించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుంది. 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు చక్కటి అవకాశం. జాతీయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు మే 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లి అక్కడి విశేషాలు వివరిస్తారు. ఇస్రో సంస్థల్లోని శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులతో చర్చించవచ్చు, ఆస్ట్రో ఫిజిక్స్, ఆస్ట్రో బయాలజీ, మెటీరియల్ సైన్సు, కంప్యూటర్ సైన్సులపై అవగాహన కల్పిస్తారు. అలాగే ఇస్రో చైర్మన్‌తో సంభాషించే అవకాశం కలుగుతుంది.

లక్ష్యం ఇదీ..

అంతరిక్ష పరిజ్ఞానంలో మన దేశం పలు విజయాలతో అగ్రరాజ్యాల సరసన నిలిచింది. ఈ స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపి వారిని ఆ స్థాయిలో తీర్చిదిద్దేందుకు యువికా ఏర్పాటు చేశారు. ఇలా భావి శాస్త్రవేత్తలను తయారు చేయాలనుకుంటున్నారు. ప్రతిభావంతుల కోసం ఇస్రో ప్రకటన జారీ చేసింది

దరఖాస్తు ఇలా..

ఇస్రో ప్రధాన వెబ్‌సైట్‌లో మార్చి 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఐఎస్ఆర్ఓ.జీఓవీ.ఇన్/యువిక.హెచ్‌టీఎంఎల్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఎంపికైన వారి జాబితాను ఏప్రిల్ 9న విడుదల చేస్తారు. మే 18న విద్యార్థులకు ఆహ్వానం అందజేస్తారు. మే 19 నుంచి 30 వరకు యువికా–2025 నిర్వహిస్తారు. మే 31తో కార్యక్రమం ముగుస్తుంది.

పిల్లలకు అవకాశం కల్పించాలి



టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికి పిల్లలకు మంచి అవకాశం. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని పిల్లలు వినియోగించుకుని సైన్సు పట్ల జిజ్ఞాసను పెంపొందించుకోవాలి. ఇందుకు సైన్సు ఉపాధ్యాయులు కృషి చేయాలి. ఈ అవకాశం పిల్లలకు దక్కితే అత్యున్నత స్థాయి శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశం కలుగుతుంది.

– రెహమాన్, సైన్సు మ్యూజియం క్యూరేటర్, కడప.

ఉన్నత స్థాయిని అధిరోహించవచ్చు



టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో ప్రతి మారుమూల గ్రామంలో ఉన్న విద్యార్థి కూడా ఉన్నత స్థాయిని అధిరోహించడానికి కలిగిస్తున్న అవకాశాల్లో ఇది ఒకటి. ఈ అవకాశాన్ని విద్యార్థులు అందిపుచ్చుకునేలా సైన్సు టీచర్లు కృషి చేయాలి. ఆసక్తి ఉన్న వారు మార్చి 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి.

– ఎబినేజర్ ఇమ్మానియేలు, జిల్లా సైన్సు అధికారి.

ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి



జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులతో ప్రతిభా అన్వేషణ పరీక్షలు రాయించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలను కలుసుకునే అవకాశాన్ని కల్పిస్తారు. ఇలాంటి అరుదైన అవకాశాన్ని విద్యార్థి దశలోనే పొందితే కచ్చితంగా దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదుగుతారు. ప్రధానోపాధ్యాయులు దీనిని బాధ్యతగా తీసుకుని రిజిస్ట్రేషన్ చేయించాలి.

– షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖాధికారి.

గడ్డివాములు దగ్ధం

– స్పందించని అగ్నిమాపక సిబ్బంది



కాలిపోతున్న గడ్డి వాము



కాలిపోతున్న ట్రాక్టర్ ట్రాలీ

సింహాద్రిపురం : ఆకతాయిలు చేసిన పనికి రైతులు వేసుకున్న గడ్డివాములతో పాటు ట్రాక్టర్ ట్రాలీ, పల్వర్ దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బిదినంచర్ల గ్రామంలో మంగళవారం సాయంత్రం ఇళ్ల సమీపాన ఎవరో ఆకతాయిలు చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి ఊరి సమీపాన ఉన్న మొలకల జయరామిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, మునిరెడ్డిలకు చెందిన నాలుగు గడ్డి వాములతోపాటు ఒక ట్రాక్టర్ ట్రాలీ, పల్వర్ దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ.2లక్షలకుపైబడి నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోతున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి ఫోన్లు చేస్తున్నా అగ్నిమాపక శాఖ సిబ్బంది స్పందించలేదని బాధిత రైతులు వాపోతున్నారు. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదన్నారు.

రెండు లారీలు ఢీ

– డ్రైవర్ దుర్మరణం





మృతి చెందిన కదిరయ్య, నుజ్జునుజ్జయిన లారీ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని కడప రోడ్డులో మై హోం కాలనీ వద్ద రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో హెచ్‌పీ గ్యాస్ లారీ డ్రైవర్ గండ్లూరు కదిరయ్య (41) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి 1.30 గంటలకు జరిగింది. ఎర్రగుంట్ల పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలం పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన గండ్లూరు కదిరయ్య హెచ్‌పీ గ్యాస్ లారీకి డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి ఎర్రగుంట్ల నుంచి కడప రోడ్డు మార్గాన వెళుతుండగా మైహోం కాలనీ వద్ద ముందు వెళుతున్న మరో లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో హెచ్‌పీ గ్యాస్ లారీ ముందు భాగం నుజ్జు నుజ్జయింది. లారీ డ్రైవర్ కదిరయ్య క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్యాబిన్‌లో ఇరుక్కున డ్రైవర్‌ను జేసీబీ సాయంతో బయటకు తీశారు. కదిరయ్యకు కాలు తెగిపోవడంతో అధిక రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి బంధువులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గురుశంకర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో
దుస్తుల వ్యాపారి దుర్మరణం

- మృతుడి స్వస్థలం కడప
- బెంగళూరుకు వెళుతుండగా దుర్ఘటన



జహీర్ (ఫైల్)



విలపిస్తున్న షమీర్



మృతి చెందిన జహీర్



కురబలకోట మండలంలో సంఘటన స్థలం

కురబలకోట ; కడప నగరంలోని జెడ్ఆర్ ఫ్యాషన్ వరల్డ్ నిర్వాహకుడు షేక్ జహీర్ (28) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలో జరిగిన ఈ విషాదకర సంఘటనకు సంబంధించి ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు.. కడప నగరానికి చెందిన జహీర్ రెండేళ్లుగా కడపలో జెడ్ఆర్ ఫ్యాషన్ వరల్డ్ పేరిట రెడీమేడ్ దుస్తుల షాపు నిర్వహిస్తున్నాడు. గతంలో ట్రావెల్స్‌లో పనిచేసేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు సంతానం. భార్య ప్రస్తుతం గర్భిణి. రంజాన్ సందర్భంగా విక్రయానికి అవసరమైన దుస్తులు కొనుగోలు చేసేందుకు తమ్ముడు షమీర్ (26)తో కలిసి షేక్ జహీర్ కారులో బెంగళూరు బయలుదేరాడు. తనే కారు నడుపుకుంటూ వస్తుండగా కురబలకోట మండలంలోని మధ్యాహ్నంవారిపల్లె–రామిగానిపల్లె మధ్యలో మదనపల్లె–2 డిపోకు చెందిన గాలివీడు ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చింది. ప్రమాదవశాత్తు బస్సును కారు ఢీకొంది. ఈ సంఘటనలో జహీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తమ్ముడు షమీర్ కారులో వెనుక సీట్లో ఉండడంతో గాయాలతో బయటపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం జహీర్ మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

మృతుడిపైనే కేసు.!

ఇదిలా ఉండగా ప్రమాదానికి మృతుడు జహీర్ కారణమని కేసు నమోదు చేయాల్సి వచ్చిందని ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. డ్రైవింగ్ చేస్తున్న జహీర్ కారును నిద్రమత్తులో అదుపు చేయలేక వేగంగా బస్సును ఢీ కొట్టడం వల్లే ఈ సంఘటన జరిగినట్లు అటు విచారణలోను ఇటు సంఘటన స్థల పరిశీలనలోను వెల్లడైందన్నారు. చనిపోయిన వ్యక్తిపై కేసు నమోదు చేయడం ఇదేమి.. విచిత్రం స్వామీ అంటూ పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా



మృతి చెందిన మంజుగోపాల్

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని హనుమనగుత్తి గ్రామానికి చెందిన గోటూరు సుబ్బరాయడు కుమారుడు గోటూరు మంజుగోపాల్ (9) సరదాగా ఈతకు వెళ్లి పెన్నానదిలో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. అదే గ్రామానికి చెందిన స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గోటూరు సుబ్బరాయుడు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు. మధ్యాహ్నం సమయంలో స్నేహితులతో కలసి మంజుగోపాల్ సమీపంలో ఉన్న పెన్నానదికి వెళ్లాడు. పెన్నానదిలో అనేక పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయి. ఆ గుంతలలో సరదాగా స్నేహితులతో కలసి ఈతకు దిగాడు. అంతే గుంతలోని అడుగు భాగంలో మంజుగోపాల్ ఇరుక్కున్నాడు. పైకి రాకపోవడతో వెంటనే స్నేహితులు మంజుగోపాల్ తండ్రి సుబ్బరాయుడుకి సమాచారం అందించారు. వెంటనే స్థానికుల సాయంతో బాలుడిని బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి



డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పాల్గొన్న కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు పలు అంశాలను డీఎం దృష్టికి తీసుకు వచ్చారు. దువ్వూరుకు కడప నుంచి నేరుగా బస్సు సౌకర్యం కల్పించాలని ఓ ప్రయాణికుడు కోరారు. అలాగే కృష్ణాపురంలో స్టేజ్ ఏర్పాటు చేయాలని, ఒంగోలుకు ఎక్స్‌ప్రెస్ బస్సు నడపాలని, విజయవాడకు కావలి మీదుగా బస్సు ఏర్పాటు చేయాని మరికొందరు కోరారు. చిత్తూరుకు ప్రస్తుతం నడుస్తున్న బస్సులకు తోడు అదనపు సర్వీసులు ఏర్పాటు చేయడంతో పాటు టైమింగ్ అప్డేట్ చేయాలన్నారు. శ్రీశైలంకు ఎక్స్‌ప్రెస్ కాకుండా సూపర్ లగ్జరీ బస్సు నడపాలన్నారు. పామూరుకు బస్సు ఏర్పాటు చేయాలని, ఎర్రగుంట్లకు సాయంత్రం 6 తరువాత బస్సు ఏర్పాటు చేయాలని, సబ్ జైలు దగ్గర బస్ షెల్టర్ ఆక్రమణలు తొలగించాలన్నారు. బస్టాండులో వివిధ వస్తువులను అధిక ధరలకు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.ఖాజీపేట బస్సు స్టేషన్‌లో దెబ్బతిన్న కుర్చీలను బాగు చేయాలని, బస్సులు ఆపని సిబ్బందిపై చర్య తీసుకోవాలని కోరారు.

రాయచోటి కేసులో 12 మందికి బెయిల్

కడప అర్బన్: అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదంపై మార్చి 9వ తేదీ పోలీసులు కొంతమందిని అరెస్టు చేశారు. కడప సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న 12 మంది మంగళవారం బెయిలుపై విడుదలయ్యారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి

మదనపల్లె : ప్రమాదవశాత్తు నీటిసంపులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. చంద్రాకాలనీకి చెందిన రాజశేఖర్‌రెడ్డి, గీత దంపతులకు సాత్విక్‌రెడ్డి, చార్విక్ రెడ్డి(5) ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం సాయంత్రం కాలనీలో నీటిసరఫరా జరుగుతున్న సమయంలో నీళ్లను పట్టుకునేందుకు తల్లి, నానమ్మ హడావిడిలో ఉండగా, ఇంటి ముందు ఆడుకుంటున్న చార్విక్‌రెడ్డి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని బయటకు తీసి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగ వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు.

35 గ్రాముల బంగారు గొలుసు చోరీ

సుండుపల్లె : మండల పరిధిలోని పింఛాలో అమ్మజ్జెమ్మ తన మనవడిని చూసేందుకు ఈ నెల 8వ తేదీన బెంగళూరుకు వెళ్లింది. సోమవారం తిరిగి తన స్వగ్రామానికి చేరుకుంది. ఇంటిలోకి వెళ్లగా బీరువా తాళాలు పగలగొట్టి 35 గ్రాముల బంగారు గొలుసును చోరీ చేసినట్లు గుర్తించింది.

ఎక్సైజ్ శాఖలో పదోన్నతుల పండుగ


- సీమ జిల్లాల్లో పదోన్నతి పొందనున్న 48 మంది హెచ్‌సీలు, క్లర్కులు
- ఈనెల 20, 21 తేదీల్లో క్లర్కులకు దేహదారుఢ్య పరీక్షలు

కర్నూలు : ఎక్సైజ్ శాఖలో పదోన్నతుల పండుగ మొదలవుతోంది. హెడ్ కానిస్టేబుళ్లు, క్లర్కుల సీనియారిటీ జాబితా రూపొందించడంలో తీవ్ర జాప్యం జరిగి వివాదంలో చిక్కుకున్న పదోన్నతి వివాదంపై డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి చొరవ చూపడంతో చకాచకా ఫైలు కదులుతోంది. ఫోర్త్‌జోన్ పరిధిలో మొత్తం 52 పోస్టులు ఖాళీగా ఉండగా 48 హెడ్ కానిస్టేబుల్, క్లర్కులకు అడ్‌హాక్ పద్ధతిలో ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించి పోస్టింగులు కేటాయించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ నుంచి ఇటీవల జిల్లా కేంద్రానికి ఉత్తర్వులు అందాయి. ఆ మేరకు డిప్యూటీ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రూప్–2 పోస్టులే అయినా అడ్‌హాక్ పద్ధతిలో పదోన్నతికి రంగం సిద్ధమైంది.

సీమ జిల్లాల్లో ఖాళీల జాబితా సిద్ధం

ఫోర్త్ జోన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎస్‌ఐ పోస్టులు ఖాళీ ఉన్నాయనే వివరాలను డిప్యూటీ కమిషనర్ ఆయా జిల్లాల ఈఎస్‌లు, ఏసీలకు లేఖ రాసి తెప్పించుకున్నారు. అలాగే హెడ్ కానిస్టేబుళ్లు, క్లర్కులకు ఎస్‌ఐలుగా పదోన్నతులు కల్పించేందుకు అర్హత ఉన్న వారి వివరాలతో పాటు వారి ఎస్ఆర్‌లను తెప్పించుకుని జాబితాను రూపొందించారు. సర్వీస్ రిజిస్టర్ల పరిశీలన పూర్తి కావడంతో ఈనెల 20, 21 తేదీల్లో క్లర్కులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించేందుకు తూనికలు, కొలతల శాఖ అధికారులకు డిప్యూటీ కమిషనర్ లేఖ రాశారు. సీమ జిల్లాల్లో 12 మంది క్లర్కులు ఎస్‌ఐలుగా పదోన్నతి పొందేందుకు జాబితా సిద్ధమైంది. వైద్యపరీక్షల అనంతరం పదోన్నతి కల్పించి ఈ నెలాఖరులోగా పోస్టింగులు కేటాయించే అవకాశమున్నట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.


వందేళ్ల చెట్టు.. ఆకట్టుకునేట్టు!



కాశినాయన మండలం జోతి క్షేత్రంలో శ్రీ లక్ష్మి నరసింహ ఆలయం ఎదుట కాశినాయన అన్నదాన మండపం మధ్యలో అతి పెద్ద రావిచెట్టు ఉంది. ఇది వంద సంవత్సరాల నాటిదని స్థానికులు చెబుతారు. కాశినాయన సహచరుడు చెన్నారెడ్డి ఆ రావి చెట్టును సంరక్షిస్తున్నారు. వందేళ్ల ఈ చెట్టును సంరక్షిస్తున్న తీరు అందరినీ ఆకట్టుకుంటోంది.

– ఫొటో: సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్,కడప.

మత సామరస్యం కాపాడాలి



జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్‌కుమార్‌ను కలిసిన అఖిల పక్ష నేతలు

కడప అర్బన్ : ఇటీవల రాయచోటి, చెన్నూరు సంఘటనల నేపథ్యంలో జిల్లాలో మతసామరస్యం కాపాడాలని మంగళవారం అఖిలపక్ష కమిటీ, మైనారీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి, ఎస్ఆర్‌సీ జేఏసీ కన్వీనర్ అహ్మద్ బాబు బాయ్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, సీపీఐ ఎం ఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఓబయ్య మాట్లాడుతూ జిల్లాలో మత సామరస్యం, శాంతిని, లౌకిక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కొందరి కుట్రల కారణంగా మత ఘర్షణలు చెలరేగి శాంతి భద్రతల సమస్య తలెత్తి ప్రజల్లో అనైక్యతకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల శాంతి సంఘాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూల విజయభాస్కర్, ముస్లిం ఫెడరేషన్ అధ్యక్షుడు మహమ్మద్ జాకీర్, మౌలానా సిరాజ్ బుఖారి, ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ షాజహాన్, సయ్యద్ చాంద్‌బాషా, ఇండిపెండెన్స్ పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాస్టర్ విజయభాస్కర్, క్రైస్తవ పెద్దలు వారధి జోసెఫ్, దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మదగలం ప్రసాద్, రాయలసీమ రైతు సంఘం నాయకుడు ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.